కవితా కౌముది

# గుర్తుందా..?

స్వాతి శ్రీపాద

మౌన సముద్రంలో మునిగి తేలుతున్నప్పుడు
చిటికెన వేలందించి
మిలమిల మెరుపుల సైకత తీరం వెంట నడిపిస్తూ
అలలు శృతి చేసిన సరిగమలు పలికించావు..
గుర్తుందా?
ఉదయాలూ సాయంత్రాలూ వెచ్చని వెలుగులకిందా
పచ్చని పచ్చికల మధ్యా మందగమనపు శీతల పలకరింపుల్లో
ఎన్ని సుదీర్ఘ పయనాలు, ఎన్ని పెదవి కదలని సంభాషణలు
ఎన్ని చిరునవ్వుల ప్రవాహాలు చివరికి ఎన్ని ఉత్తేజాలు, ఉద్వేగాల బదిలీలు
గుర్తున్నాయా?
కప్పు కాఫీ వన్ బై టూ పంచుకున్న రోజులు
గుప్పెడు పరిమళాలలో విరిసిన జీవన సంబరాలు
కంటి వెలుగుల్లో చూపు తళుకుల్లో
ఎన్ని వేల కాంతి సంవత్సరాలు ముందుకూ వెనక్కూ
వెళ్ళి వచ్చాం!?
లోలోపలి కాన్వాస్ మీద జీవితంలో మంచి గీసుకున్న
తైలవర్ణ చిత్రాలు ఎప్పటి కప్పుడు మనో నేత్రం గోడల మీద
కొత్తగా తాజాదనం అలదుకుంటూ
ముడతలుపడిన వయసుకొలతల్లో కొత్త ఉత్తేజాన్ని నింపుకుంటూ
ప్రతిక్షణమూ ఒక పునర్జన్మే.

★★★★

## నలత
### అనూరాధ బండి

లేలేత కిరణాల నులివెచ్చటి
చంటితనపు స్పర్శలాంటిదేదో
కాగితంపై అక్షరాలను
వేడి కన్నీటిబొట్లలా కురిపించినపుడు.

చెయ్యి విడువని పసితనపు మారాం ఎక్కడో..
లోలోపలి పోగుచేసుకున్న జ్ఞాపకపు దొంతరలలో.
ఎందుకోగానీ ఉద్వేగపుటొణుకు.
ఊపిరితీసుకున్న ప్రతిసారీ ఒక ఇరుకు.

మంకుగా కాగితాన్ని గాలిపటం చేసి
జ్ఞాపకాలన్నీ దారపు పోగుతో జతచేసి
కవిత్వమని ఎగురవేసి చూస్తానా!

ఎక్కడో ఎలానో జత కుదరక
ఎటువటే వెళ్ళిపోతాయి.

కవిత్వం కాలేక, కవితలుగా ఎగురలేక
ఆ జ్ఞాపకాలు కాగితంపై ఎంత నలిగిఉంటాయో..!!

★★★

## మళ్ళీ..మళ్ళీ..!
### సుజాత పి.వి.ఎల్

కాలానికి గాలం వేసినట్టు
నిత్య యవనికావ్యక్త
నిశ్చలానుభూతి తటిల్లతలా తళుక్కుమని మెరిపిస్తూ
స్వర్గాన్ని తలపిస్తున్న
ఈ అనుభూతిని ఏమనాలో!?.
మౌనాన్ని మళ్ళించి
పలుకు పర్జన్య స్వరవ్యాప్తినై
విస్తరించటానికి  కారణమేమిటో!
ప్రకృతి
ప్రతిదినం తియ్యగా పలకరిస్తుంటే
ఆశావహ హృద్యభావం కావ్యగీతికలా గోచరిస్తుంది..
కవిత్వంతో భవితవ్యపు తీరాన్ని దాటాలనే ఆలోచన
అభినందనీయ సాహసంలా అనిపిస్తూంది..
ప్రభాతాలు పొదువుకొంటూ
ప్రకాశాన్ని పులుముకొంటూ
పంచభూతాలను సముద్వీక్షిస్తూ
ఇహాశ్వపు పరుగుతో పథికురాలినై ప్రజ్వలింపజేస్తున్న
కవనభాష్యానికి మోకరిల్లాలనిపిస్తోంది..
మంచి రచననాస్వాదించిన మది
ముదావహ మేఘమై
సమ్మోహనోల్లాస చిరుజల్లులు కురిపిస్తుంటే..
అలౌకికానంద సంభరితురాలినై..
కవితాత్మక వస్తువునై
మళ్ళీ మళ్ళీ మొగుస్తూనే వుండాలనిపిస్తోంది..
కవి మనోభావ దర్పణా సాదృశ్య వీచికనై
పాఠక హృదిని స్పృశిస్తూ.. ★★★

# గోదావరి నించి పసిఫిక్ దాకా..
## డా.కె.గీత

పరవళ్ల గోదావరి నించి
మంచు కెరటాల
పసిఫిక్ దాకా
చిన్న ప్రయాణం కాదు
కాళ్ళని గీరుకుని
పాదాల్ని గుచ్చుకునే ముళ్ళు -
దారంటా కాపు గాచి ఉండే
వలల వేటగాళ్లు -
భుజాల్ని వెనక్కి లాగి పెట్టే
అపవాదాలు -
అడుగు ముందుకు
పడనివ్వని అవరోధాలు-
అయినా
కొండంత గొడుగల్లే కవిత్వం
నీడనిచ్చింది
దారంట
సేదతీరమని ఇన్ని
జాబిలి తునకల్ని సంచీలో
సర్దిపెట్టింది ..!
అజ్ఞాతంగా
నా వెన్నెంటుతూ
కవిత్వం
చల్లని రాత్రి ఆకాశమై
తాను
నక్షత్రాల దుప్పటీ కప్పుకున్నప్పుడల్లా
పక్కకి జరిగి కాస్త చోటిచ్చింది
ఎప్పటికప్పుడు
గాయాల్ని తుడిచి
వెన్నెల లేపనం పూసింది
త్రోవ పొడవునా
కురిసే ఆక్రోశాల వడగళ్ళని
అమ్మ చెంగై ఆదుకుంది
రగిలే అసూయా కార్చిచ్చుల నించి
వాన ధాత్రయి పొదువుకుంది
సప్త సముద్రాల్ని చీల్చి
భూమికివతల
నాకు తలదాచుకుందుకు
ఇంత చోటిని పంచి ఇచ్చింది
తప్పిపోయిన పాలపిట్టల్ని
హమ్మింగ్ బర్డ్స్ గా
మా పెరట్లో గింగిరాలు కొట్టించింది
దడదడ లాడే
రాజమండ్రి బ్రిడ్జి లాంటి  జీవితాన్ని
గరుడ పక్షి లాంటి  డంబార్టన్  బ్రిడ్జి గా మార్చి
పరవళ్ల గోదావరి నించి
మంచు కెరటాల పసిఫిక్ దాకా
తనే అయ్యి
నన్ను ఎదిగిన పసితనాన్ని చేసింది
నాలో అమాయకత్వాన్ని  బతికించి ఉంచి
నన్ను  మనిషిగా మిగిల్చింది

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నవ్వరోచిస్సులెల్లెడ నాట్యమాడు
దివ్యదీపావళీపర్వదినము నేడు
ఇళ్ళ లోగిళ్ళలోన వాకిళ్ళలోన
కాంతిరేఖలే కనులకు కానిపించు

పడతులెల్లరు వచ్చి దీపాలు పెట్టి
వేయి సొగసుల నించిరి వీధి యెల్ల
సంబరముతోడ బాణసంచాలు కాల్చి
వెలుగు విరజిమ్ముచుండిరి పిన్నలెల్ల

కనుల విందైన యీ పర్వదినము నాడు
నిండువెలుగుల పుడమెల్ల నిండిపోయె
చేతనైనంతలోనొక చిన్న దివ్వె
తనివి తీరగ వెలిగింప తలచినాను

అఖిలభూవలయము సృష్టియంత నిండి
తేజరిల్లిన దేవుని దివ్యకాంతి
ప్రమిదదీపంబు పెట్టగ వచ్చు నాకు
కనుల మిరుమిట్లు గొల్పి చీకటిగ తోచె

ఆ మహాజ్యోతి నా హృదయాంతరమున
తిమిరహరణకిరణగణతేజమాయె
ఒక్క చిరుదివ్వె వెలిగింపనూహజేయ
వేయి దీపాలు పెట్ట దీపించె వేల్పు

COMMENTS